రెగ్యులేటర్లకు రెడ్ లైట్



మొండికోడుకు వెళ్లు రోడ్డులో ఎండిన కొల్లేరు

కొల్లేరు పరిరక్షణ మరిచిన సర్కార్ • నెరవేరని సీఎం జగన్ హామీలు • పర్యాటక అభివృద్ధి ఉత్తి మాటలే • పల్లెల్లో మంచినీరు కరువు

మరోవైపు వైసీపీ అనుకూలురు కొల్లేరుపై పంజా • ఎడాపెడా అక్రమ చెరువుల తవ్వకాలు • ఎన్నికల వేళ మరోసారి సర్కస్ ఫీట్లు

'ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సరస్సు వైపు ఉప్పునీరు వెళ్లనీయం. రైతులకు, పరీవాహక ప్రజలకు ఇబ్బందులు రానివ్వం. నూరు శాతం స్వచ్ఛనీరుతో కళకళ లాడేలా చూస్తాం. ఎంత ఖర్చయినా పర్వాలేదు, రెగ్యులేటర్లు నిర్మించి తీరతాం. మీ కలలను సాఫల్యం చేస్తాం' గత ఎన్నికలకు రెండేళ్ల ముందు గణపవరంలో సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు, కృష్ణా జిల్లాలో ఒక రెగ్యులేటర్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. కాని, ఒక్కరు ముందుకు రాలేదు.ఎక్కడా రెగ్యులేటర్ల ఛాయలే కనిపించ లేదు. ఇదంతా కొల్లేరుకు సంబంధించిన వ్యవహారం.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కొల్లేరులో ఉప్పు నీరు చొరబడకుండా మూడు రెగ్యులేటర్ల నిర్మాణం చేపడుతున్నట్టు 2022, మేలో గణపవరం మండలానికి వచ్చిన సీఎం జగన్ హామీల వర్షం కురిపించారు. ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం మోళ్ళపర్రు, కృష్ణా జిల్లా పడితడిక వద్ద మూడు రెగ్యులేటర్‌లను రూ.470 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ హామీ ఇచ్చి రెండేళ్ల దాటింది. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు మొహం చాటేశారు. కాంట్రాక్ట్ తీసుకున్న ప్రతి పనికి లోకల్ నేతలకు కమిషన్ చెల్లించాల్సిందే. ఆ భారం మోయలేక ముందుగానే కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఫలితంగా టెండర్లు నిలిచిపోయాయి. కాని కొల్లేరుకు, పరీవాహక ప్రాంత ప్రజలకు వైసీపీ ఏదో చేస్తున్నట్లుగా ఈ రెండేళ్ల తెగ బిల్డప్ ఇస్తూ వచ్చారు. జిరాయితీ భూముల వ్యవహారంలోనూ లేనిపోని ఆశలు పెట్టారు. అక్రమ చెరువులు తవ్వకాన్ని ప్రోత్సహిస్తున్నప్పుడు ఎవరైనా ఎదురు తిరిగితే ఇదంతా మీకోసమేనంటూ సర్దిచెప్పేశారు. కొల్లేరు మాటున అక్రమాలు చేస్తూ పైపైకి కొల్లేరు పరీవాహకంలో ఉన్న ఓట్లను తమవైపు తిప్పుకోవడానికి చేయని ప్రయత్నాలు ఏమీ లేవు. ఎన్నికలు దగ్గరపడే కొలది చేయని జిమ్మిక్కులు లేవు. పైపైకి ఆమె కొల్లేరు పరిరక్షకులమంటూనే లోలోపల చేయాల్సిందంతా చేసేశారు. కొల్లేరు లంకల్లో లంక గ్రామాలు కొన్నింటిలో అనేకసార్లు వివిధ వర్గాల మధ్య చిచ్చు లేచింది. ఆఖరికి వెలికి దారితీసింది. కుల కట్టుబాటు పేరిట రకరకాల విన్యాసాలు, ఇంత జరుగుతున్నా అధికార వైసీపీ అబ్బా అదేమి లేదు అన్నట్లుగానే సీన్ క్రియేట్ చేస్తూ వచ్చింది. సుమారు కొల్లేరు పరీవాహకంలో 120 గ్రామాలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది ప్రజలు నివసిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వీరి ఓట్లకు గాలం వేసేందుకు రకరకాల ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రెగ్యులేటర్లు కట్టలేదు ఎందుకు? పర్యాటకంగా చేస్తామన్నారుగా ఎందుకు చేయలేదు? పల్లెల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్న మాట ఏమైంది? ఇలాంటి ప్రశ్నలతో కొల్లేరు వాసులు సిద్ధమవుతున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో సీన్ రివర్స్

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రెగ్యులేటర్ నిర్మాణానికి ప్రతిపాదన ఉంది. కొల్లేరులో ఐదు టీఎంసీల నీరు నిల్వ చేసే క్రమంలో పోలవరం కుడి కాల్వ నుంచి గోదావరి జలాలను కొల్లేరుకు మళ్లించాలని చంద్రబాబు సీఎంగా వున్న సమయంలో అధికారులు ఆయనకు నివేదించారు. కొల్లేరు సరస్సులో నీటి నిల్వ సామర్థ్యం సంతృప్తికర స్థాయిలో ఉంటే దీని ప్రభావంతో కొల్లేరు పరీవాహక ప్రాంతమంతా భూగర్భ జలాలు పెరుగుతాయని ఉప్పు నీరు తగ్గి మంచినీరు క్రమేపి పెరుగు తుందని, దీంతో సాగు, తాగు అవసరాలు దాదాపు తీరుతాయని అధికారులు అప్పట్లో ఈ ప్రతిపాదన చేశారు. సముద్రం నుంచి ఉప్పుటేరు మీదుగా ఉప్పునీరు కొల్లేరులోకి ఎగబాకకుండా చేయడమే అప్పటి అధికారులు చేసిన ప్రధాన సూచన. ఆకివీడు వద్ద రెగ్యులేటర్ నిర్మాణం జరిగితే ముందస్తుగా కొంత మేర కొల్లేరును కాపాడుకోవచ్చని గోదావరి జలాలను కొల్లేరుకు మళ్లించేందుకు సూచనలతో రావాల్సిందిగా అప్పటి ప్రభుత్వం కోరింది. గత ఎన్నికల్లో తెలుగుదేశం ఓటమి, వైసీపీ విజయం అనంతరం పరిస్థితి తారుమారైంది. వైసీపీ అనుకూలురు కొల్లేరుపై పంజా విసిరారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నా కొల్లేరులో ఎడాపెడా చెరువులు తవ్వేశారు. ఈ ఐదేళ్లలో అటవీ సంరక్షణ అధికారులు అనేక వాహనాలను, యంత్రాలను సీజ్ చేశారు. మరికొంతమందిపై కేసులు నమోదు చేశారు. అయినా వైసీపీ అనుకూలురు దూకుడు తగ్గలేదు.

కొల్లేరులో నీరు ఇంకింది

ఆసియాలోనే అతి పెద్దదైన మంచినీటి సరస్సుగా రాణించిన కొల్లేరు బావురుమంటోంది. గతంతో పోలిస్తే ఈసారి కొల్లేరులో అత్యధిక భాగం ఎండి బీటలు వారింది. సాధారణంగా మే చివరి నాటికి తప్ప మార్చి చివరార్థం నాటికి ఇలాంటి పరిస్థితి రావడం దాదాపు అరుదు. భారీ వర్షాలతో రెండు నెలల క్రితం వరకు నిండుగా ఉన్న కొల్లేరు ఎడారిగా మారింది. వివిధ దేశాల నుంచి వచ్చే పక్షుల గూడు చెదిరింది. పరీవాహంలో తాగునీటి ఎద్దడి ఆరంభమైంది. కొల్లేరులో సాధారణ స్థాయిలో మూడు టీఎంసీల నీరు నిల్వ ఉండడానికి అవకాశం లేదు. రాన్రాను ఆ పరిస్థితి సన్నగిల్లింది. రెగ్యులర్ నిర్మాణం అనుకున్నది అనుకున్నట్టు పూర్తయితే ఈ పరిస్థితి నివారించేవాళ్ళు ప్రకటనలే తప్ప ఆచరణ లేకపోవడంతో వైసీపీ సర్కారులో కొల్లేరుకు కొత్త కష్టాలు ఆరంభమయ్యాయి. అన్ని చేస్తామని చెప్పి చివరకు చేతులెత్తేశారు. రెగ్యులేటర్ల గొప్పలు చెప్పి హామీలతో సరిపెట్టారు. ఎన్నికలకు ముందు జనం ఎదుట సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. నేడు నీరు ఇంకి కొల్లేరు వెలవెలబోతోంది.



సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

» సీఈవో ముఖేష్ కుమార్ మీనా..
» ఏలూరు జిల్లాలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన
» సోషల్ మీడియా ప్రచారంపై నిఘా

ఏలూరు సిటీ, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీరు, టెంట్లు వంటి సౌకర్యాల కల్పనలో పూర్తిస్థాయి శ్రద్ధ వహించాలి' అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం మీనా ఏలూరు విచ్చేశారు. ఆయనకు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ మేరీప్రశాంతి, జేసీ లావణ్యవేణి స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లోని మీడియా కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లు, ప్రవర్తనా నియమావళి అమలుపై మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరుపై ఆరా తీశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదుల వివరాలను కంట్రోల్‌రూమ్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, ఆర్‌వోలకు చేరవేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ మాధ్యమాల్లో వచ్చే రాజకీయ పర ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి వాటిని సంబంధిత ఆర్వోలకు పంపడం ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సోషల్ మీడియా విభాగాన్ని పర్యవేక్షిస్తున్న ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్ వివరించారు. సీ-విజిల్ పర్యవేక్షక విభాగాన్ని, స్టాటిక్ సర్వే లెన్స్, ఫ్లయింగ్ సర్వే లెన్స్ టీంల వాహనాలకు అమర్చిన జీపీఎస్ విధానం ద్వారా క్షేత్రస్థాయి పరిశీలనలో అవి ఎక్కడ ఉన్నది, నిఘా బృందాల కదలికలను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణా తీరును పరిశీలించారు. ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు పంపే విభాగాన్ని సందర్శించారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ వివరించారు.



ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఈవో మీనా

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

జిల్లాలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎంపిక చేసిన ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను సీఈవో సందర్శించారు. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, చింతలపూడి, పోలవరం, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఒకే ఆవరణలో ఉన్నందున ఆయా నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరు సముదాయాల్లో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత లేఅవుట్‌ను పరిశీలించగా కలెక్టర్ వివరాలను తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన భద్రతకు సంబంధించి ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులకు సీఈవో సూచించారు.

స్వీప్ కార్యక్రమాలపై సంతృప్తి

స్వీప్ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఐటీడీఏ పీవో ఎం.సూర్య తేజ, అసిస్టెంట్ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

సీ-విజిల్‌లో 11 కేసులు పరిష్కరించాం

భీమవరం ఆర్‌వో శ్రీనివాసులురాజు



- ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ప్రజల నుంచి ఇప్పటి వరకు సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన 11 ఫిర్యాదులను పరిష్కరించాం.
- భీమవరం నియోజకవర్గంలో అనుమతి లేకుండా నగదు తరలిస్తున్న రెండు కేసులను పట్టుకున్నాం. ఇందులో కృష్ణా జిల్లా సరిహద్దులోని లోసరి చెక్ పోస్టు వద్ద పది లక్షలు, వీరవాసరం వద్ద రూ.1.62 లక్షల నగదును పట్టుకున్నాం. వీటికి ధ్రువీకరణలు చూపెడితే నగదును విడుదల చేస్తాం. రూ.50 వేలు నుంచి నగదు తీసుకువెళ్లాలంటే అనుమతి తప్పనిసరిగా చూపించాలి.
- కొత్తగా ఓటు హక్కు కోసం వచ్చే నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.
- రాజకీయ పక్షాలు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇంటింటికి ప్రచారం, ర్యాలీలు, బహిరంగ సభలు, మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహించాలంటే అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఇందుకు 19 రకాల ధ్రువీకరణలతో అనుమతి పొందాలి. వీటికి 24 గంటల ముందు దరఖాస్తు చేయాలి. పరిశీలించి అనుమతి ఇస్తాం. అనుమతి తీసుకోకుండా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు పెడతాం.
- ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఓటర్లు ఫిర్యాదు చేయటానికి ప్రత్యేక ఫోన్ నెంబర్లు ఏర్పాటు చేశాం. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08816- 299616 సువిధ నెంబర్ 08816-299617 హెల్ప్‌లైన్ నెంబర్ 08816-299618 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.

- భీమవరం

33 శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

భీమవరం, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో ఉంటూ పోలింగ్ రోజు ఓటు వేయలేని 33 నిత్యావసర సేవల శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'జిల్లాలో ఈ పోస్టల్ బ్యాలెట్‌పై ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతోపాటు ఫారం 12డిలను అందుబాటులో ఉంచాం. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం పొందిన శాఖలు మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు రవాణా) సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి కమిషన్ ఆమోదంతో అధికార లేఖలు జారీ పొందిన మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కోఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీస్, అటవీ, సమాచార ప్రజా సంబంధాలు, పోలీసు, పౌరరక్షణ, హోం గార్డు, ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ(పవర్), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ తదితర శాఖలు అధికారులు, సిబ్బంది ఉంటార'ని ఆయన వివరించారు.

ఏప్రిల్ రేషన్ ఇంటికే

ఏలూరు సిటీ, మార్చి 29 : ఏప్రిల్ నెల రేషన్ సరఫరా ఏ విధంగా జరుగుతుందనే మీమాంసకు తెరపడింది. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా ఎండీయూ వాహనాలపై వున్న సీఎం జగన్ చిత్రపటంపై స్టిక్కర్లు అతికించడంతో ఏప్రిల్‌లో ఇంటింటికీ రేషన్ సరఫరా జరుగుతుందని పౌర సరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. ఆ వాహనాలపై ఈ రేషన్ సరఫరాకు సంబంధించి ప్రచారం ఉండటంతో ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని, అందువల్ల రేషన్ ఇంటింటికీ సరఫరా అవుతుందా.. అన్న ప్రశ్న తలెత్తింది. అయితే ఆ వాహనాలపై ప్రభుత్వ ప్రచారాలు కనబడకుండా స్టిక్కర్లు అతికించడంతో ఏప్రిల్‌లో ఇంటింటికీ రేషన్ సరఫరా చేయనున్నారు.

వలంటీర్‌పై వేటు

పెనుమంట్ర,మార్చి 29 : అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన పెనుమంట్ర మండలం గరువు గ్రామ పంచాయతీ వలంటీర్ బొల్లా లిఖితను విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో పద్మజ ఆదేశాలు జారీచేశారు. అధికార పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి హాజరు కావాలని మహిళలను ఆహ్వానిస్తూ డ్వాక్రా గ్రూపుల్లో పెట్టిన వాయిస్ మెసేజ్‌పై సీ విజిల్‌కు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపి ఈ నిర్ణయం తీసుకున్నారు.

సిరుల పంట



రబీలో ఎకరానికి 80 బస్తాల దిగుబడి.. మెట్టలో ముమ్మరంగా మాసూళ్లు

డెల్టాలో ధమాల్.. ఎకరానికి 40 నుంచి 50 బస్తాలే దిగుబడి

తాడేపల్లిగూడెం రూరల్/ భీమవరం రూరల్, మార్చి 29 : రైతుల కష్టానికి ఫలితం కనిపిస్తోంది. ఈ ఏడాది రబీలో దిగుబడులు రికార్డు స్థాయిలో నమోదు కావడంతో రైతుల కన్నుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మెట్టలో రబీ సీజన్ మాసూళ్లు మొదలయ్యాయి. తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం, కడియద్ద, మోదుగ గుంట, అప్పారావుపేట తదితర గ్రామాల్లో వరి మాసూళ్లు ముమ్మరంగా జరుగుతుండటంతో ఎకరానికి గరిష్టంగా 80 బస్తాలు, కనిష్టంగా 70 బస్తాల దిగుబడి వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. బస్తా ధాన్యం కళ్లాల వద్ద రూ.1,310కి విక్రయించి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం కొత్త విధానం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించాలంటే రైతులు భయపడిపోయే పరిస్థితి నెలకొంది. ఎంతో కొంత సొమ్ము ముందు వచ్చి పడిపోతే ఇబ్బంది లేదు. కానీ ధాన్యం తూసేందుకు ఇబ్బందులు పడలేమని రైతులు వాపోతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా వున్నా గతం లోను ఇదే మాదిరి ధాన్యం విక్రయాలు చేసే వాళ్లమని, కానీ ప్రభుత్వ విధానాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డామని రైతులు చెబుతున్నారు.

దళారులే మేలు

'వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ వాతావరణంలో ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో మాసూళ్లు సజావుగా సాగుతున్నాయి. ఇదే మాదిరి మరో పది రోజులు ఉంటే పంట మొత్తం అమ్ముడైపోతుంది' అని అప్పారావుపేటకు చెందిన రైతు జి.సత్యనారాయణ చెబుతున్నారు. 'ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్మాలంటే వణుకు పుడుతోంది. సంచుల నుంచి మిల్లర్ల వరకూ రైతులను అంతా ఇబ్బంది పెట్టేవారే. కాస్త డబ్బులు తక్కువ ఇచ్చినా దళారుల దగ్గరే ధాన్యం అమ్మడం మేలు అనిపిస్తోంది' మోదుగగుంటకు చెందిన రైతు మెండెల్లి పల్లయ్య చెప్పారు.

డెల్టాలో అంతంతే..

మెట్టలో దిగుబడులు అనుకూలంగా ఉన్నప్పటికీ డెల్టాలో మాత్రం అంతంతమాత్రంగా ఉండే అవకాశం వుంది. డెల్టాలో రెండు లక్షల 15 వేల ఎకరాలు, మెట్టలో 15 వేల ఎకరాల్లో సాగు ఉంది. డెల్టాలో ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు మించి దిగుబడి ఉండదని రైతులు అంచనా వేస్తున్నారు. ఊడ్పులు ఆలస్యం కావడమే దీనికి కారణం. మరోవైపు 1153 రకం వెనుక సాగుకు తెగుళ్ళు సంక్రమించడం మరో కారణం. దీనివల్ల ఎక్కువ శాతం 50 బస్తాలు మించి దిగుబడి రాకపోవచ్చు.



క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల పరమార్థాన్ని పాస్టర్లు వివరించారు. పలుచోట్ల శిలువను మోస్తూ వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. 6లో



తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. భీమవరంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 6లో



ఎంపీ రఘురామకు న్యాయం జరగాలంటూ అభిమానులతో ర్యాలీ

కూటమిదే విజయం.. : ఎంపీ రఘురామ

భీమవరం/ఉండి/పాలకోడేరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో వినాశకర వైసీపీ సర్కార్‌ను గద్దె దింపేందుకు ఏర్పడిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. భీమవరంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే ప్రజలు కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీకి న్యాయం జరగాలంటూ అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. మరోవైపు రఘురామను అమరావతి రైతులు మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. నరసాపురం టిక్కెట్ కూటమి తరపున ఇవ్వాలని పార్టీ అధిష్టానాలను కోరారు. ఉండి, గొల్లలకోడేరుకు చెందిన టీడీపీ నాయకులు జత్తుగ శ్రీను, కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, కాగిత బుజ్జి, కమ్మిలి రాంబాబు, సాలా మల్లేశ్వరరావు, కొండపల్లి ఏసురత్నం, తంగెళ్ళ శ్రీను, ట్యాంక్ శ్రీను, తదితరులు ఆయనను కలిశారు.



సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవంలో ఓపి గోయెంకా, తదితరులు

విజేత సూపర్ మార్కెట్ ప్రారంభం



తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 29: తాడేపల్లిగూడెంలో శుక్రవారం విజేత సూపర్ మార్కెట్‌ను ఫుడ్స్ ఫ్యాట్స్ అధినేత ఓపి గోయెంకా ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటు ధరల్లో సరుకులు ఉండేలా విజేత సంస్థ 110వ సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. సందీప్, శ్రీశ్రీ డెంటల్ అధినేత జి. శ్రీనివాసరావు, ఆడిటర్ ఎన్వీ రమణరావు, తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై. సత్యనారాయణమూర్తి, విజేత బిజినెస్ హెడ్ హరికృష్ణ, బ్రాంచి మేనేజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా తాడేపల్లిగూడెం ఆర్టీసి డిపో సమీపంలోని కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ విజేత సూపర్ మార్కెట్‌లో ప్రతి రూ. 999 కొనుగోలుపై 1 కేజీ చక్కెర ఉచితంగా అందించడంతోపాటు రూ.500 కొనుగోలు దారులకు ఉచిత కూపన్ అందించి ఏప్రిల్ 5న విజేతలకు 1 కారు, 5 బుల్లెట్స్, 25 స్కూటీలు, 111 ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్‌లు అందించనున్నారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి

భీమవరం క్రైం, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనివాస్ అన్నారు. భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శ్రీవిజ్ఞాన వేదిక, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఎన్నికల్లో ప్రజలు సహకరించాలని అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేజీఆర్ఎల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సాయిదుర్గాప్రసాద్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ సామరస్యం పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె చాన్‌బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మనిషిగా అందుబాటులో ఉంటా: శివ



పాలకోడేరు, మార్చి 29 : ప్రజల కష్టాలు ఎరిగిన వ్యక్తిగా ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజల కష్టాలను తీరుస్తానని ఉండి మాజీ ఎమ్మెల్యే ఉండి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేటుకూరి వెంకటశివరామరాజు అన్నారు. కొండేపూడి గ్రామం నుంచి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామరాజుకు ప్రజల వద్ద నుంచి అనూహ్య స్పందన లభించింది. గ్రామస్తులు శివరామరాజుకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈసందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా శివ స్వచ్ఛంద సంస్థ ద్వారా వైద్యం అందిస్తామన్నారు.

టీడీపీలో బీసీ యువత చేరిక

భీమవరం అర్బన్, మార్చి 29: యువనాయకులందరు కూటమి అభ్యర్థుల గెలుపుకు, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేయలని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు, జిల్లా పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు నీలాతి రమేష్ యాదవ్, సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కొండ్రు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గొలగాని రమేష్ 150 మంది బీసీ యువకులు తెలుగుదేశం పార్టీలో శుక్రవారం చేరారు. వీరిని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి పార్టీ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

రంగులు తొలగించారు



పెంటపాడు, మార్చి 29: రంగులు మార్చడం లేదు.. శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని ఆలంపురం పాత రైతు భరోసా కేంద్రానికి వేసిన వైసీపీ రంగులు తొలగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో రేషనలైజేషన్ ఆపాలి

తణుకు, మార్చి 29: మున్సిపల్ పాఠశాల్లో రేషనైలేషన్ ప్రక్రియను నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్ ప్రభుత్వాన్ని శుక్రవారం ప్రకటనలో కోరారు. జీవో నంబరు 117, 128, 60లను అమలుచేయరాదని, కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఇలాంటి ప్రయోగాలు చేయవద్దని చెప్పారు.

హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

తణుకు, మార్చి 29: ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఈవో వెంకట రమణకు హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. శుక్రవారం భీమవరంలోని ఆయన కార్యాలయంలో పలువురు ప్రధానోపాధ్యాయులు తమ సమస్యలను వివరించారు. వేసవి సెలవుల్లో విధులు నిర్వహించిన హెచ్‌ఎంలకు ఆర్జిత సెలవు మంజూరు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు.

అమ్మవారికి పుచ్చకాయలతో అలంకరణ



భీమవరం టౌన్, మార్చి 29: భీమవరం మెంటేవారి తోటలో శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారికి పుచ్చకాయలతో అలంకరణ చేశారు. విజయనగరంకు చెందిన జున్నూరి కృష్ణ లోవ దొరబాబు, శశిరేఖ దంపతులచే ఆలయ అర్చకులు కొమ్మ శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం 50 పుచ్చకాయలతో పూజ చేసి అలంకరణ చేశారు.

మంగళ్ పాండేకు నివాళులు

భీమవరం టౌన్, మార్చి 29: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలం మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని, బ్రిటిష్ వారిపై యుద్ధాన్ని ప్రకటించిన తొలి స్వాతంత్ర్య సమర యోధుడు మంగళ్ పాండే అని తెలుగు రచయిత కలిగొట్ల గోపాలశర్మ, అరసవల్లి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళ్ పాండే వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక క్విట్ ఇండియా స్థూపం వద్ద జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు తదితరులు మంగళ్‌పాండేకు నివాళులు అర్పించారు.

మావుళ్ళమ్మ అన్నదాన పథకానికి విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, మార్చి 29: మావుళ్ళమ్మ నిత్యాన్నదాన పథకానికి చిన అమిరంకి చెందిన కె.వెంకట సుబ్బరాజు శ్రీదేవి దంపతులు లక్ష నూట పదహారు రూపాయలు విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు.

ఈ నెల 31 వరకే వడ్డీ రాయితీ గడువు

భీమవరం టౌన్, మార్చి 29 : మునిసిపాలిటీలో ఆస్తిపన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుందని కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి పన్నుపై వడ్డీ జమ అవుతుందని తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజుల్లో కూడా పురపాలక సంఘ కార్యాలయంలోని పురసేవ కౌంటరు ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. వార్డు సచివాలయాల్లో కూడా కౌంటర్ లు ఏర్పాటు చేశామని తెలిపారు.









గణపవరంలో టీడీపీ నాయకులు.. పెనుగొండలో మాజీ మంత్రి పితాని, తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి ఎన్టీఆర్ చిత్ర పటాల వద్ద నివాళులు.. తణుకులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి

సంక్షేమ పథకాలకు సారథి ఎన్టీఆర్

ఘనంగా టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం

భీమవరం అర్బన్, మార్చి 29 : తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ చిరస్మరణీయుడని, తెలుగువాడి ఆత్మగౌరవాన్ని చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ముందుగా పట్టణ పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు టీడీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, నాయకులు మెరగాని నారాయణమ్మ, వీరవల్లి దుర్గా భవాని, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: కిలో రెండు రూపాయల బియ్యం నుంచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బండారు కార్యాలయం లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనుగొండ: సంక్షేమ పథకాలు అమలు చేసిన మహోన్నత వ్యక్తి ఎన్‌టీఆర్ అని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెనుగొండ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేసి బడుగు బలహీన వర్గాలకు రాజకీయంలో స్థానాన్ని కల్పించి చట్టసభలకు పంపించిన ఘనత ఎన్‌టీఆర్‌కే దక్కుతుందన్నారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, వెలిచేటి బాబూ రాజేంద్ర ప్రసాద్, పిల్లి సత్తిరాజు, కొండవీటి శ్రీనివాసరావు, నక్కా వేద వ్యాస శాస్త్రి, మండా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆచంట: ఆచంటలో పార్టీ కార్యాలయం వద్ద పితాని తనయుడు వెంకట్ శుక్రవారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య, పృథ్వి, కేతా మురళి, ఎం.సుబ్బారావు, సత్యవతి పాల్గొన్నారు. పెనుమంచిలి, వేమవరం, కొడమంచిలి, వల్లూరు గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించారు.

తణుకు: టీడీపీ ప్రభుత్వం రావడం ఖాయమని, అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఎస్సీ, బీసీలను ఎమ్మెల్యేలు, మంత్రులుగా చేసిన ఘనత టీడీపీదేనని, కిలో రెండు రూపాయలు బియ్యం, పేదలకు పక్కా ఇళ్లతో ఎన్టీఆర్ పేదల గుండెల్లో నిలిచిపోయారని వివరించారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, తోట సూర్యనారాయణ, కలగర వెంకట కృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, అనాల ఆదినారాయణ, పితాని మోహన్, గోపిశెట్టి రామకృష్ణ, అబ్బదాసరి లాజర్ పాల్గొన్నారు.

గణపవరం: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు ఆశయ సాధనతో వైసీపీ ప్రభుత్వంపై సమరశీల పోరాటం చేయాలని గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకలు పిప్పర, గణపవరం, అర్థవరం, మల్లపురాజుపేట, మొయ్యేరు, సరిపల్లె, ముప్పర్తిపాడు, జల్లికాకినాడ తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాలు ఆవిష్కరించి మిఠాయిలు పంచారు.అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న పాల్గొన్నారు.

పెనుమంట్ర: తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని టీడీపీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి అన్నారు. మార్టేరు తేతలి రాజారెడ్డి అతిథి గృహప్రాంగణంలో టీడీపీ జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. సత్తి సాయి ఆదినారాయణ రెడ్డి, సానుబోయిన గోపాలకృష్ణ, వెలగల బులి రామిరెడ్డి, గూడూరు మురళి పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: పేదవర్గాలైన ఎస్సీ, బీసీల అభ్యున్నతి కోసమే ఆనాడు దివంగత ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు అన్నారు. పాలకొల్లులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. మున్సిపల్ మాజీచైర్మెన్ వల్లభు నారాయణ మూర్తి, పాలకొల్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, పాలకొల్లు మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు.





నరసాపురంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న మాధవనాయుడు.. రామరాజు, కొవ్వలి



ఆకివీడులో సతీమణి సుష్మతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మంతెన రామరాజు

ఆకివీడు : తెలుగుదేశం కూటమితోనే రాష్ట్రాభివృద్ధి అని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. శుక్రవారం 14వ వార్డులో ప్రచారంలో భాగంగా టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే రామరాజు ఆయన సతీమణి సుష్మతో కలిసి కేక్ కట్‌చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదన్నారు. దానిని గద్దె దించాలన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

పోడూరు: కొమ్ముచిక్కాలలో మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, పోడూరులో సీనియర్ టీడీపీ నాయకుడు రుద్రరాజు వరహాలరాజు ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి దాసరి రత్నరాజు, బీసీసెల్ అధికార ప్రతినిధి పాలవలస తులసీరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భీమవరం, ఉండి నియోజక వర్గాలలో శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా ఉండిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మంతెన రామరాజుతో కలిసి పాల్గొని ఎన్‌టి రామారావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంగర వెంట పాలకొల్లు నియోజక వర్గ సీనియర్ నాయకులు వీరమల్లు సూరిబాబు, గూడవల్లి వెంకటేశ్వరరావు (తాతయ్య) తదితరులు ఉన్నారు.

సర్వమానవాళికి ఏసుక్రీస్తు రక్షకుడు

• క్రైస్తవుల గుడ్‌ఫ్రైడే ర్యాలీ





నరసాపురం, వీరవాసరంలలో గుడ్‌ఫ్రైడే ర్యాలీలు

ఆకివీడు, మార్చి 29: సర్వమానవాళిని రక్షించడానికి ఏసుక్రీస్తు జన్మించాడని ఆర్సీఎం చర్చి ఫాదర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా గాంధీజీ సెంటర్ నుంచి ఆర్సీఎం చర్చి వరకు జాతీయరహదారి గుండా సుమారు రెండు కిలోమీటర్లు శిలువలు చేతపూని భారీ ర్యాలీ నిర్వహించారు.

కాళ్ళ: ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ఆయా సంఘాలు పాస్టర్లు, విశ్వాసులు విశదీకరించారు. బైబిల్ లేఖనాల ప్రకారం లేఖనాల నెరవేర్పు, సిలువ త్యాగం, పాపుల రక్షణ వంటి అంశాలను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు.

పాలకోడేరు: మండలంలోని గ్రామాల్లోని అన్ని చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాపులను రక్షించేందుకు శిలువ వేయబడ్డ ఏసుక్రీస్తును కీర్తిస్తూ ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నరసాపురం టౌన్: నరసాపురం లూథరన్, పెంతికొస్తు, బీబీసీ, జీవన్‌జ్యోతి, ఆర్‌సీఎం, బేతస్థ చర్చిలతో పాటు మండలంలోని నవరసపురం, సరిపల్లి, పసలదీవి, రుస్తుంబాదా, సీతారాంపురం, కొప్పర్రు, చిట్టవరం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసాలు పాటించారు. క్రైస్తవులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టెంట్‌లు ఏర్పాటు చేశారు. ఆర్‌సీఎం రుస్తుంబాద చర్చి ఫాదర్ బిలాన్‌బాబు శిలువను మోస్తూ ర్యాలీ నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్: ప్రభువైన ఏసు ప్రేమ తత్వాన్ని క్రైస్తవులందరూ కలిగి ఉండాలని పాస్టర్ జాన్‌హైడ్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శంభుని పేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ టీచర్లు, విద్యార్థులు, సంఘ విశ్వాసులు క్రీస్తు గీతాలు ఆలపించారు.

మొగల్తూరు: మొగల్తూరు పాలపర్తివారిపేట లూథరన్ ప్యారిష్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ గోడి యేసేబ్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కరుణ, ప్రేమ, త్యాగనిరతి ఉండాలని అదే జీసస్ ప్రపంచానికి ఇచ్చిన సందేశమన్నారు. అనంతరం ఏసు ప్రభువును శిలువకు కట్టి శిక్షించిన దృశ్యాలను కళాకారులు ప్రదర్శించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పెనుగొండ: పెనుగొండలోని రాజుగూడెం లూథరన్ చర్చిలో పాస్టర్ యూబీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలు సందర్భాలను ఏడుగురు సంఘ సభ్యులచే చక్కగా వివరించే కార్యక్రమం నిర్వహించారు. చర్చిని అందంగా అలంకరించారు.

గణపవరం: సర్వమానవాళి పాపప్రక్షాళనకు క్రీస్తు ప్రాణత్యాగం చేశారని, ఆయన త్యాగ నిరతి ఈ లోకానికే ఆదర్శమని పలువురు పాస్టర్లు అన్నారు. గణపవరం మండల వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గణపవరం, సరిపల్లె, అర్ధవరం, ప్పిర, కేశవరం, జల్లికాకినాడ తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భీమవరం టౌన్: పట్టణంలోని రూపాంతర దేవాలయంలోను, ఆర్‌సీఎం చర్చితోపాటు పలు చర్చిలల్లో ఉదయం నుంచి ప్రార్థనలు చేశారు. ఆదివారం ఏసు ప్రభు సమాధి నుంచి లేస్తాడని, కుటుంబంలో గతించిన వారు కూడా ఆరోజు ఉదయిస్తారని వేకువజాము నుంచి సమాధుల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులు దైవ ప్రార్థన చేస్తారని అన్నారు.

పాలకొల్లు టౌన్: క్రీస్తు బోధనలు ఆచరనీయమని పాస్టర్ ఈద శ్రీనివాసరావు అన్నారు. పాలకొల్లు సబ్బేవానిపేట సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో శుక్రవారం క్రీస్తు బోధనలు చేశారు. సంఘ సీర్ విప్పర్తి ప్రభాకర్, చర్చి నిర్మాణ కమిటీ చైర్మెన్ పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

వీరవాసరం: వీరవాసరంలోని మేడేవారి పేట, అరుందతి పేటలో ఉన్న ఆర్‌సీఎం క్రైస్తవ దేవాలయాల నుంచి గొంతేరు డ్రెయిన్ సమీపంలో ఉన్న డివైన్‌మెర్సీ ఆర్‌సీఎం ఆలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు సిలువలు మోస్తూ ర్యాలీలో ప్రార్థనలు చేశారు.

ఉండి: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శిలువలో ఏసుప్రభువు పలికిన 7మాటలను ప్రత్యేకంగా వివరించారు. ఉండి, ఎన్‌ఆర్‌పిఅగ్రహారం, చెరుకువాడ, యండగండి, మహదేవపట్నం, వాండ్రం, చిలుకూరు, ఉప్పులూరు, కోలమూరు, కలిగొట్ల, ఆరేడు, ఉణుదుర్రు, పాములపర్రు తదితర ప్రాంతాల్లో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు.

చారిటబుల్ ట్రస్ట్ వితరణ

పాలకొల్లు అర్బన్, మార్చి 29: గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక సాయి థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జల్లి ఏసు ఆధ్వర్యంలో వడ్డిగూడెం చర్చి వద్ద 1000 మందికి మజ్జిగ, ఆరంజ్ జ్యూస్‌లను అందజేశారు. కార్యక్రమంలో జల్లి ఏసు, సాలా మల్లేశు, కావడి రాంబాబు, జల్లి సురేంద్ర, బండి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ-మద్దిరావమ్మ సంబరం



ఆకివీడు, మార్చి 29: ఆకివీడు మాదివాడ గంగానమ్మ-మద్దిరావమ్మ 65వ వార్షికోత్సవ సంబరం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మంతెన రామరాజు అమ్మలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, వార్డు ఇన్‌చార్జి అడపా అబ్బులు పాల్గొన్నారు.

జనసేనలోకి ఎస్సీ నాయకులు

నరసాపురం రూరల్, మార్చి 29: మండలంలోని కొప్పర్రు గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు ఎస్సీ నాయకులు జనసేనలో చేరారు. వీరందరికీ కన్వీనర్ బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిలో దారం చిట్టిబాబు, ఎలియాజరు, భాస్కర్‌రావు, శ్రీకాంత్, జయరాజు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

నరసాపురం రూరల్, మార్చి 29: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయండంటూ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అభ్యర్థించారు. శుక్రవారం మండలంలోని వేములదీవి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ కష్టం రాకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి పట్టం కట్టాలని విన్నవించారు.

నేడు రన్‌ఫర్ జీసస్

నరసాపురం టౌన్, మార్చి 29: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో రన్‌ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ సంజయ్ కిషన్ తెలిపారు. థామస్ వంతెన నుంచి పట్టణ వీధుల గుండా ఈ ర్యాలీ సాగుతుందన్నారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని ఆయన కోరారు.

వీరవాసరం కార్యకర్తల్లో నిరుత్సాహం

వీరవాసరం, మార్చి 29: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు వీరవాసరం మండలంలోని పార్టీ కార్యకర్తలను నిరాశకు గురిచేసింది. ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో ఆవిర్భావ వేడుకలకు అధికారుల నుంచి అనుమతి తప్పనిసరి. మండల పార్టీ ప్రతినిధులు అనుమతులు కోసం ప్రయత్నించకపోవటం వలన ఈ పరిస్థితి ఎదురైంది. వీరవాసరంలోని వేడుకలునిర్వహించే ప్రదేశాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు ముసుకులు వేసి ఉండటం వలన కనీసం విగ్రహానికి పూలమాలలు కూడా వేయలేకోయామని నిరాశ చెందారు.

బొండాడపేట రహదారి నిర్మాణం

కాళ్ళ, మార్చి 29 : ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న రహదారి నిర్మాణం పూర్తి కావడంతో బొండాడపేట గ్రామ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొండాడపేట గ్రామంలో 200 మీటర్లు ఉండే రహదారిని గ్రామ సర్పంచ్ గోళ్ళ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్మించారు. ప్రధానంగా ఈ దారికి ఇరువైపులా పద్మశాలీలు నివాసముంటున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోళ్ళ సత్యనారాయణను ఆ ప్రాంత పద్మశాలీలు శుక్రవారం ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ నాయకుల ఎన్నికల ప్రచారం

పాలకొల్లు అర్బన్, మార్చి 29 : కాంగ్రెస్ పార్టీ నియోజక సమన్వయ కర్త కొలుకులూరి అర్జున రావు ఆధ్వర్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఉప్పుగొయ్యి, రజక పేట, పూలపల్లి ఈదా వారి పేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ప్రతి పేదవాడికి కాంగ్రెస్ పార్టీ అంటే ఎంతో అభిమానం అని, ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన అనేక పథకాలు నేటికీ గుర్తు ఉన్నాయని అర్జున రావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆచంట, మార్చి 29: విద్యుత్ మరమ్మతులు కారణంగా వల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, అయోధ్యలంక, పోడూరు మండలంలోని వద్దిపర్రు, గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సురేష్ కుమార్ తెలిపారు.

స్వాగతం బోర్డుకు మూత



స్వాగతం బోర్డును కప్పి వేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 29: తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట లోని కోరుమామిడి రోడ్డులో ఏర్పాటుచేసిన స్వాగతం బోర్డును అధికారులు శుక్రవారం కప్పి వేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల్లో భాగంగా బోర్డుపై నాయకుల చిత్రాలు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించి బోర్డుపై బరకం వేసి కప్పి వేశారు.







వడ్లవానిపాలెంలో ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర ప్రచారం.. పెంటపాడులో బొలిశెట్టి కరపత్రాల పంపిణీ.. నరసాపురంలో జనసేన సమావేశం

పెంటపాడు, మార్చి 29: వైసీపీ పల్లెల అభివృద్ధిని గాలికొదిలేసిందని, పెంటపాడులో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయని జనసేన ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెంటపాడులో నిర్వహించిన పల్లెపోరులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ బూటకపు హామీలిచ్చి అధికారం చేపట్టిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, టీడీపీ నాయకులు గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, దాసరి అప్పన్న, కొనకళ్ళ హరినాథ్, బండి పెద్దిరాజు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పాలి

యలమంచిలి, మార్చి 29: గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి అన్నారు. నిమ్మల సూర్యకుమారి టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి యలమంచిలి గ్రామంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమలు జరిపే పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

సేవకునిగా పనిచేశా: ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లురూరల్, మార్చి 29 : నియోజక వర్గ ప్రజలందరూ నావాళ్ళే అనుకుని వారికి అవసరమైన సమయాల్లో సేవకునిగా పనిచేశానని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం గొల్లవాని చెరువు, వడ్లవానిపాలెంలలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌తో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. పెన్మెత్స సాయిరాజు, శ్రీనివాసరాజు, జోగి బాలయ్య, ప్రసాద్, ఆర్ విష్ణు, కసుకుర్తి బుల్లయ్య, సేవ మిత్ర, సాధికార యువత సభ్యులు, జనసేన నాయకులు దుర్గా బాబు, శివరామరాజు, ప్రదీప్ తమ్మిరెడ్డి తేజ, ఫణీ, శిడగం సురేంద్ర, పితాని వెంకటేశ్, తులా రామలింగేశ్వరరావు, పాల్గొన్నారు.

గెలుపే మన లక్ష్యం: కొత్తపల్లి

నరసాపురం, మార్చి9: ఈ ఎన్నికల్లో వైసీపీని ఓడించడమే మన లక్ష్యం, కూటమి బలపర్చినా అభ్యర్థి విజయం కోసం మనమంతా సైనికుల్లా పని చేయాలని జనసేన నాయకులు కొత్తపల్లి సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. సరిపల్లి పంచాయతీలో శుక్రవారం రాత్రి జరిగిన జనసేన ఆత్మీయ సమన్వయ సమావేశానికి ఆయన అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ అందర్ని కలుపుకుని సమన్వయంతో ముందుకు సాగుతానని హామీఇచ్చారు. చాగంటి మురళీ, చినమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

విజయం మనదే : పొత్తూరి

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కొవ్వలి నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దీనికి జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అతిథిగా విచ్చేశారు. ముందుగా పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. బొమ్మిడి మాట్లాడుతూ ఎన్నికల్లో అందర్ని కలుపుకుని ముందుకు సాగుతారన్నారు. పొత్తూరి, కొవ్వలి మాట్లాడుతూ ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మామిడిపండ్లు వచ్చేశాయ్..

» చెరుకు రసాలు పరక రూ.500 వరకు, చిన్నరసాలు రూ.600 వరకు అమ్మకాలు

కాళ్ళ, మార్చి 29 : అందరూ ఇష్టంగా తినే మామిడిపండ్లు ఈ ఏడాది సీజన్ కంటే ముందే వచ్చేశాయ్. సాధారణంగా ఏప్రిల్, మేనెలల్లో పండ్ల సీజన్ మొదలవుతుంది. మార్చిలోనే మామిడి పండ్లు రావడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కాళ్ళ మండలం సీసలి గ్రామ వద్ద రాష్ట్రీయ రహదారిని ఆనుకుని పండ్ల దుకాణాం వెలిసింది. చెరుకు రసాలు రకం పరక రూ.400 నుంచి రూ.500 వరకు, నూజివీడు చిన్నరసాలు రూ.500 నుంచి రూ.600 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. నూజివీడు తోటల్లోంచి మామిడిపండ్లను దిగుమతి చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడే మామిడి కాయలు రావడంతో అధిక రేట్లు వెచ్చించి కొనాల్సి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.


సీసలి వద్ద రోడ్డు పక్కన అమ్ముతున్న వ్యాపారులు

నోరూరించే పుచ్చకాయలు

» పుచ్చకాయ ధర సైజును బట్టి రూ.50 నుంచి 130 వరకు అమ్మకాలు

ముదినేపల్లి, మార్చి 29 : వేసవి కాలం ప్రారంభమైతే మార్కెట్‌లో పుచ్చకాయలు ప్రత్యక్షమవుతాయి. ఈ ఏడాది ముందస్తుగానే ఎండల తీవ్రత పెరగడంతో పుచ్చకాయల అమ్మకాలు పెరిగాయి. ఈ సీజన్‌లో కాయలకు సహజంగానే గిరాకీ పెరగడంతో ధరలు పెరుగుతాయి. ముదినేపల్లి ప్రాంతంలో అధిక సంఖ్యలో పుచ్చకాయలు అమ్మకాలు జరుగుతున్నాయి. జ్యూస్ షాపుల్లో పుచ్చకాయల జ్యూస్ అమ్ముతున్నారు. సైజును బట్టి పుచ్చకాయ ధర రూ.50 నుంచి రూ.130 వరకు అమ్ముతున్నారు.

బహుళ ప్రయోజనకారి..

పుచ్చకాయ బహుళ ప్రయోజనకారి వేసవిలో జనం తినే ముఖ్యమైన కాయల్లో విటమిన్లు అధికంగా ఉంటాయి. శక్తి వంతమైన యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలున్నాయి. పుచ్చకాయలలో 92 శాతం నీరు ఉండడంతో తిన్న వెంటనే శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దాహం తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఈ కాయ ప్రయోజనకారి. జీర్ణ వ్యవస్థను బలపరుస్తుంది.


ముదినేపల్లిలో పుచ్చకాయల అమ్మకాలు


హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్, అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు జిల్లాకు హైకోర్టు న్యాయమూర్తి రాక

» నేడు ఉమ్మడి పశ్చిమ జిల్లా న్యాయాధికారులతో సమీక్ష

ఏలూరు క్రైం, మార్చి 29 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శుక్రవారం సాయంత్రం ఏలూరు జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఆయనకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, అదనపు ఎస్పీ స్వరూపరాణి, ఏలూరు ఆర్డీవో ఖాజావలి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. శనివారం ఏలూరు కలెక్టరేట్ గోదావరి కాన్ఫరెన్సు హాలులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, ఇతర న్యాయమూర్తులు మర్యాదపూర్వకంగా కలిశారు.

'ఎస్ఆర్‌కేఆర్'లో జీఆర్‌యూ, టోఫెల్ పరీక్ష కేంద్రం


టోఫెల్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన సాగి ప్రసాద్‌రాజు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 29 : ఉన్నత చదువులకై విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల కోసం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జీఆర్‌యూ, టోఫెల్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన జీఆర్‌యూం, టోఫెల్ కేంద్రాన్ని కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. కళాశాల సెక్రటరీ ఎస్ఆర్‌కే నిశాంత్‌వర్మ, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ గత ఏడాది మార్చి 31వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) ఇందుకు సంబంధించి ఎంవోయు కూడా చేసుకున్నారన్నారు. గతంలో విద్యార్థులకు విజయవాడ లేదా హైదరాబాద్ వెళ్లి శిక్షణ పొంది అక్కడ పరీక్ష రావాల్సి వచ్చేందన్నారు. తమ కళాశాలలో అధికారికంగా ఇటువంటి సెంటర్‌ను ఏర్పాటు చేయడం వద్ద విద్యార్థులు ఇక్కడే శిక్షణ పొంది పరీక్షలు రాసి వెళ్లే ఆస్కారం ఏర్పడిందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, గౌరవ చైర్మన్ పి.కృష్ణంరాజు, వైస్ చైర్మన్ గోకరాజు రామరాజు, ఎస్వీ రంగరాజు, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


సికింద్రాబాద్ నుంచి సిల్‌చార్‌కు ప్రత్యేక రైలు



ఏలూరు క్రైం, మార్చి 29 : సికింద్రాబాద్ నుంచి సిల్‌చార్‌కు ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు ఒక వైపు మాత్రమే నడపడం జరుగుతుందని, రైల్ నంబర్ 07050 సికింద్రాబాద్‌లో ఈనెల 31వ తేదీ ఆదివారం సాయంత్రం 4.35 గంటలకు బయలు దేరుతుందని ఏప్రిల్ 3వ తేదీ రాత్రి 11.20 నిమిషాలకు గంటలకు చేరుతుం దన్నారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, గుంటూరు జంక్షన్, విజయవాడ జంక్షన్, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపూర్, బలుగన్, కుర్దా రోడ్డు జంక్షన్, భువనేశ్వర్, కటక్, జాజిపూర్ కె.రోడ్డు, భద్రక్, బాల్‌సూర్, కరగ్‌పూర్ జంక్షన్, ధన్‌కుని, బోల్‌పూర్ ఎస్.నిత్తాన్, రామ్‌పూర్, న్యూఫరక్ జంక్షన్, మాల్దా టౌన్, మార్‌సోల్ జంక్షన్, కిషన్‌గంజ్, న్యూజలపాయిగురి, న్యూకోచ్ బీహార్, న్యూ అల్‌పూర్‌దుర్, న్యూ బంగా యిగాన్, రంగియా జంక్షన్, కమక్యాయ, గౌహతి, జాగీరోడ్, హోజాల్, మందిర్ దిషా, న్యూ అప్‌లాంగ్, బాదర్‌పూర్ జంక్షన్‌లలో ఆగుతుందని తెలిపారు. ఈ మార్గాల వెంబడి ప్రయాణించే ప్రయాణికులు ఈ రైల్వే సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

దళితవాడలు బాగుపడాలంటే కూటమి గెలవాలి : సాయిబాబు

ఇరగవరం, మార్చి 29 : కూటమి గెలుపుతోనే దళితవాడలు అభివృద్ధి చెందుతాయని మాజీ జడ్పీటీసీ, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కె.ఇల్లిందలపర్రు, తూర్పువిప్పర్రు, కె.కుముదవల్లి గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో ఆయన పర్యటించి తణుకు కూటమి అభ్యర్థి రాధాకృష్ణను గెలిపించాలని కోరారు. జగన్ ప్రభుత్వంలో ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారని, దళితులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చోడే సంజీవరావు, ముప్పిడి నరసింహమూర్తి, బొంత చిట్టిబాబు, చింతపల్లి భాస్కరరావు, సాకా రామాంజనేయులు, కంకిపాటి నాగన్న, దాయం వెంకటరావు, తానేటి సుబ్రహ్మణ్యం, మెరిపే రాజేష్, మురాల కొండయ్య, శాస్త్రి, మట్ట ఆంజనేయులు, టీడీపీ ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.



29-03-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	241	235	239.54
	జంగారెడ్డిగూడెం-1	241	235	239.59
	జంగారెడ్డిగూడెం-2	241	235	239.48
	కొయ్యలగూడెం	241	235	239.36
	గోపాలపురం	245	235	238.72

కోడ్ ఉల్లంఘనలు

» నిఘా పెంచాం : సీఐ సుభాష్
» వాహన తనిఖీలు.. లెక్క చూపని సొమ్ము స్వాధీనం
» గణపవరం మండలంలో ఇప్పటి వరకు రూ.16.62 లక్షల నగదు స్వాధీనం

నగదు, మద్యం రవాణా అడ్డుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతోంది..ఉమ్మడి పశ్చిమ జిల్లాలో శుక్రవారం పలు ప్రాంతాల్లో ఆధారాలు చూపని నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.


సరిపల్లి తనిఖీల్లో పట్టుబడిన నగదు చూపుతున్న సీఐ సుభాష్

సరిపల్లిలో రూ.6.14 లక్షల స్వాధీనం

గణపవరం, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, ఇతర వస్తువులు రవాణా చేసే చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘా పెంచామని నిడమర్రు సీఐ ఎంవీ.సుభాశ్ తెలిపారు. శుక్రవారం గణపవరం మండల సరిపల్లి గ్రామ సరిహద్దులో ఎఫ్ఎస్‌టీ టీమ్ ఇన్‌చార్జి సరస్వతి, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. భీమవరంవైపు నుంచి గణపవరం వస్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఓ వాహనంలో రూ.1,14,700, మరో వాహనంలో రూ.5 లక్షలు నగదు ఉన్నట్టు గుర్తించి మొత్తం 6 లక్షల 14 వేల 700 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద ఈ నగదుకు సంబంధించి ఎటువంటి రసీదులు, ఆధారాలు లేవని సీఐ తెలిపారు. నిడమర్రు సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు రూ.16లక్షల 62,600 నగదు సీజ్ చేశామని, జిల్లా ట్రెజరీకి జమ చేశామన్నారు.

భీమడోలులో రూ.లక్ష స్వాధీనం

భీమడోలు, మార్చి 29 : ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా భీమడోలులో లక్ష రూపాయల నగదును గుర్తించి స్వాధీనపర్చుకుని నగదును స్ట్రాంగ్ రూమ్‌కు తరలించామని ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు ఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. నగదును తీసుకువెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. రూ.50 వేలు కంటే ఎక్కువ తరలిస్తే ఆ సొమ్మును స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

నూజివీడులో రూ.5.30 లక్షలు..


నూజివీడులో నగదుతో సీఐ మూర్తి

నూజివీడు టౌన్, మార్చి 29: నూజివీడులో వాహనంలో తరలిస్తున్న రూ.5.30 లక్షలను నూజివీడు పట్టణ సీఐ మూర్తి స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ వద్ద నిర్వహిస్తున్న సాధారణ తనిఖీల్లో ఆధారాలు చూపని నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. విజయ డెయిరీ వాహనంలో ఈ నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఆధారాలు చూపి నగదును తీసుకువెళ్ళవచ్చని లేనిపక్షంలో ఈ నగదును ఉన్నతాధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

విస్తృతంగా తనిఖీలు


ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 246.43 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.70,550 అని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు స్వాధీనం చేసుకున్న నగదు విలువ మొత్తం రూ.13,85,060 అన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లాల్లో ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికి 31 ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీమ్‌లు ఆకస్మికంగా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నాయన్నారు. కేంద్ర సాయుధ బలగాలతో సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఓటర్లను ఎవరైనా ప్రలోభపెట్టినా, వారికి ఆకంటం కల్గించినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా మత సంబంధమైన విషయాలపై లేదా ఎదుటి పార్టీ వారిపై విమర్శలు కాని చేయరాదని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.

ఇంకా రంగుల్లోనే కార్యాలయం


బోడపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఇనుప స్తంభాలకు వైసీపీ రంగులు

పెంటపాడు, మార్చి 29: ఎన్నికల కోడ్ వచ్చినా రంగులు తొలగింపులో మాత్రం అధికారుల తీరు మారడం లేదు. బోడపాడు పంచాయతీ వద్ద ఉన్న ఇనుప స్తంభాలకు వైసీపీ రంగులు ఇంకా తొలగించలేదు.

ఫ్లయింగ్ స్క్వాడ్ దాడి.. మద్యం స్వాధీనం

» వైసీపీ ప్రచార కార్యక్రమానికి తీసుకువెళ్తున్నట్టు నిందితుడు వెల్లడి


పోలీసులు సీజ్ చేసిన మద్యం సీసాలు

ముసునూరు, మార్చి 29: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని గురువారం రాత్రి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పొలిశెట్టి శ్రీనివాసరావు దాడి చేసి పట్టుకున్నారు. సూరేపల్లి గ్రామానికి చెందిన కొరివి నాగరాజు బైక్‌పై మద్యం సీసాలను రవాణా చేస్తుండగా అక్కిరెడ్డిగూడెం శివారులో దాడిచేసి పట్టుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రూ.6370 విలువగల 49 మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకుని ముసునూరు ఎస్ఐ పి.వాసుకు అప్పగించినట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా చెక్కపల్లి ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యాన్ని కొనుగోలు చేసి సూరేపల్లిలో జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమానికి తీసుకువెళ్తున్నట్లు తెలిపాడని ఎస్ఐ తెలిపారు. కోడ్ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకులు ప్రచారాలకు, ర్యాలీలకు, ఇతర కార్యకలాపాలకు సైతం మద్యం, నగదు, ఇతర తాయిలాలు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం సమాచారం

160 లీటర్ల సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు


పట్టుబడ్డ నాటు సారాతో పోలీసులు

పోలవరం, మార్చి 29 : పోలవరం మండలంలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో నల్లకాలువ వద్ద పోలీసుల వాహనాల తనిఖీల్లో 160 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. మెత్తప్పకోట గ్రామానికి చెందిన మిడియం రాంబాబు అనే వ్యక్తి మోటారు బైకుపై 160 లీటర్ల సారా రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడని సారా స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశామని పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసి జంగారెడ్డిగూడెం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఏలూరు కిరాణా షాపులో చోరీ

ఏలూరు క్రైం, మార్చి 29 : షాపుకు తాళం వేసి ఇంటికి వెళ్లి మరుసటి రోజు ఉదయం వచ్చేసరికి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆ షాపులో నగదు, కిరణా వస్తువులు అపహరణకు గురైనట్టు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు వసరోపేటకు చెందిన శంకర్ కిరాణాషాపు నిర్వహిస్తున్నారు. ఈనెల 28వ తేదీ రాత్రి యథావిధిగా షాపునకు తాళాలు వేసి ఆ షాపుపైనే ఆయన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. 45 వేల రూపాయల నగదు, కొన్ని కిరాణా వస్తువులు అపహరణకు గురైనట్టుగా గుర్తించారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 29:నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు కొత్తబస్టాండ్ వద్ద పాలగూడెంకు చెందిన చెల్లుబోయిన సత్యనాగరాజు మద్యం విక్రయిస్తున్నట్టు త్రీటౌన్ సీఐ వి వెంకటేశ్వరరావుకు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. అక్కడే ఏలూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎన్నాడ శుభాష్ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతడిని తనిఖీ చేశారు. అతడి వద్ద నాలుగు మద్యం బాటిళ్లు లభించడంతో అతడిని కూడా అరెస్టు చేశారు.

నేడు కొల్లేరు ప్రజలతో ఆత్మీయ సమావేశం

కైకలూరు, మార్చి 29: కైకలూరు నియోజకవర్గంలోని కొల్లేరు ప్రజలతో శనివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు టీడీపీ రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు కైకలూరు సీఎన్నార్ గార్డెన్ కల్యాణ మండపంలో కైకలూరు, మండవల్లి మండలాల్లోని కొల్లేరు గ్రామాల ప్రజలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆయా గ్రామస్థులు సమావేశానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు టౌన్, మార్చి 29: బొబ్బిలి కొండలరావు స్మారక ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాస్కెట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో శుక్రవారం తొలుత ఇండియన్ నేవీ, జైన్ వర్సిటీ జట్లు తలపడ్డాయి. 54-66 స్కోరుతో జైన్ వర్సిటీపై ఇండియన్ నేవీ జట్టు విజయం సాధించగా, అనంతరం నిర్వహించిన మ్యాచ్‌లో ఇండియన్ ఆర్మీ, ఏపీ జట్లు తలపడ్డాయి. ఏపీపై 34-78 స్కోరుతో ఇండియన్ ఆర్మీ విజయం సాధించింది. ఇండియన్ బ్యాంక్-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌పై ఇండియన్‌బ్యాంక్ 52-93 స్కోరుతో విజయం సాధించింది.

సైన్స్ ఫెయిర్‌లో దీక్షిత ప్రతిభ

ఆగిరిపల్లి, మార్చి 29: శోభనాపురంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దీక్షిత సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌లో సులభ పద్ధతిలో శానిటరీ నాప్‌కిన్స్ తయారీపై వివరించినందుకు జిల్లా వ్యాప్తంగా రెండో బహుమతి లభించింది. ఆగిరిపల్లి ఎంఈవోలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారావు, దీక్షితను, సైన్స్ ఉపాధ్యాయిని ఘంటా సుధారాణిని అభినందించారు.

కులదూషణపై డీఎస్పీ విచారణ

ముదినేపల్లి రూరల్, మార్చి 29: మండలంలోని వైవాక గ్రామానికి చెందిన కూరపాటి వెంకటేశ్వరరావు, అతని అనుచరులు తనను కులం పేరుతో దూషించారని, అదే గ్రామానికి చెందిన పెయ్యల పౌలు ఈనెల 20న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదైంది. ఇందులో భాగంగా ఏలూరు డీఎస్పీ ఇ. శ్రీనివాసులు వైవాక గ్రామంలో శుక్రవారం స్థానికులను విచారించి నివేదిక తయారు చేశారు. డీఎస్పీ వెంట ఎస్సై కె.వెంకట కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపాడులో ఘనంగా గ్రామోత్సవం

చాట్రాయి, మార్చి 29: కోటపాడులో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం ఉదయం 8.10 గంటలకు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం సీతారాములు తదితర దేవతా విగ్రహలను మంగళవాయిద్యాలతో కన్నుల పండువగా ఊరేగించారు. మహిళలు బిందెలతో జలాలను తీసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం మహాశాంతి హోమం, కుంభపూజ, పంచశయ్యాదివాసం, చతుర్వేదపారాయణం, మంగళహారతి, నీరాజన మంత్ర పుష్పం, ప్రసాద వితరణ జరిగింది.

స్వాగతం బోర్డుకు మూత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


స్వాగతం బోర్డును కప్పి వేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 29: తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట లోని కోరుమామిడి రోడ్డులో ఏర్పాటుచేసిన స్వాగతం బోర్డును అధికారులు శుక్రవారం కప్పి వేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల్లో భాగంగా బోర్డుపై నాయకుల చిత్రాలు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించి బోర్డుపై బరకం వేసి కప్పి వేశారు.

దాడి ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విచారణ


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న వెంకటలక్ష్మి

ఏలూరు రూరల్, మార్చి 29: స్థానిక 27వ డివిజన్‌లో ఉన్న శ్రీలక్ష్మి శ్రీనివా సా పద్మావతి అమ్మవారి ఆలయ కార్యదర్శి అచ్యుతకుమారిపై మాజీ కార్యదర్శి రెడ్డినాగరాజు తీవ్రంగా దాడిచేసి గాయపరిచాడని, ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొం దుతూ ఘటనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం బాధితురాలు నివాసం ఉంటున్న కంద్రికగూడెంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గజ్జెల వెంకటలక్ష్మి తదితరులు వెళ్లి పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళను గాయపర్చటం దారుణమని, వృద్ధురాలైన ఆమెపై దాడిచేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి సూచించామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

ప్రతీ విషయానికి రాజకీయ రంగు

» టీడీపీ కార్పొరేటర్లు హేమసుందరి, అరుణ ఆగ్రహం

ఏలూరుటూటౌన్, మార్చి 29: ఓటమి భయంతో వైసీపీ నేతలు ఎన్నికల సమయంలో ప్రతీ విషయానికి రాజకీయ రంగు పులుముతున్నారని టీడీపీ కార్పొరేటర్లు భీమవరపు హేమసుందరి, తంగిరాల అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బడేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంగెళ్ళమూడి దేవాలయంలో ఇటీవల జరిగిన చిన్నపాటి ఘర్షణ తెలుగుదేశం పార్టీ నాయకులపై రుద్దటాన్ని ఖండిస్తున్నామన్నారు. 27వ డివిజన్‌లో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఆలయ ధర్మకర్తకు అచ్యుతకుమారికి మెంబరు రెడ్డినాగరాజులకు స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ తోపులాటలో ఆలయ ధర్మకర్తకు చిన్నపాటి గాయమైంది. దాన్ని టీడీపీ కార్యకర్తలపై రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పోణంగిలో వైసీపీ నేత గేదెల సూర్యప్రకాశ్‌ను అదే గ్రామానికి చెందిన గంటా అరుణ అనే మహిళా స్థలాన్ని కబ్జా చేశారని దాంతో మనస్తాపానికి గురైన అరుణ ఆత్మహత్య చేసుకుందన్నారు. బొల్లాయిగూడెంలో చిన్నారిపై వలంటీర్ మానభంగం చేశాడని అన్నారు. ఆ సమయంలో మహిళా కమిషన్ ఎక్కడుందని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల దారుణాలు మహిళా కమిషన్‌కు పట్టవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పృధ్వీశారధ, నగర అధ్యక్షురాలు తవ్వా అరుణకుమారి పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం పట్టణం, మండవల్లి మండలం భైరవపట్నంలో పోలీసుల కవాతు దృశ్యాలు

పోలీసుల కవాతు

తాడేపల్లిగూడెం రూరల్/మండల్లి, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలీసులు, సాయుధ బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. తాడేపల్లిగూడెం పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించడం తమ బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించాలనే పట్టణ, గ్రామాల్లో కవాతులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. మండవల్లి మండలంలో సమస్యాత్మక గ్రామాలైన ఉనికిలి, పెరికేగూడెం, భైరవపట్నం గ్రామాల్లో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు, సిబ్బంది సీఐఎస్ఎఫ్ వారితో కలిసి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు.